నవంబర్ - డిసెంబర్, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

Merry Christmas





# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామమున మీకు క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు. మనలను ఆయన కృపలో భద్రపరిచి, నడిపిస్తున్న దేవునికి స్తోత్రములు. గడిచిన రెండు నెలలలో మనము ఊహించనివి ఎన్నో సంఘటనలు మన రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. వాటిలో ప్రాముఖ్యమైనది మన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులైన వై.యస్.రాజశేఖర్‌రెడ్డి గారి ఆకస్మిక మరణం రాష్ట్రంలో అనేక మందిని తీవ్రంగా కలిచివేసింది. ఎందరో అమాయకులు అనాలోచనతో బలవన్మరణం చెందటం మనము విన్నాము. ఒక మంచి ముఖ్యమంత్రి చనిపోయారు అనే బాధ కంటే ఎక్కువగా ఎందరో బలవన్మరణం పొంది నరకమునకు వెళ్ళారనే వేదన దైవబిడ్డలను కలిచివేస్తుంది. అలాంటి అనాధలైన కుటుంబముల కొరకు మనము భారముతో ప్రార్థన చేయవలసి ఉన్నది. ఇలాంటి సందర్భములలో దేవుని వాక్యములను జ్ఞాపకం చేసుకుంటే కాలములు, సమయములు మన తండ్రియైన దేవుడు తన స్వాధీనంలో ఉంచుకున్నాడు గనుక వాటిని తెలుసుకొనుట మన పని కాదు అని అపొ.కార్యముల గ్రంథము 1:7లో వ్రాయబడి ఉన్నది. మన ప్రియుల మరణములు మనకు దుఃఖమును కలిగించినా, వాక్యమును బట్టి ఓదార్పు పొందాలే కానీ విపరీత ప్రవర్తనతో తప్పు నిర్ణయములు తీసుకోకూడదు.

మరో ఊహించని సంఘటన నాలుగు జిల్లాలలో కొన్ని ప్రాంతములను వరదలు ముంచెత్తటం. లక్షలాది మంది నిరాశ్రయులై వారు పడిన బాధలు వర్ణనాతీతం అయితే తోటి మనుష్యులు అంత బాధలో ఉన్నప్పుడు కొందరు ఎంతో సహృదయంతో సహాయం చేయుట ఆనందదాయకం. ఎంత ఆస్తిపాస్తులున్నా, అధికారం ఉన్నా కొన్ని విపత్తుల నుండి తప్పించుకోవటం సాధ్యం కాదు అని మనకి అర్థం అవుతుంది. కేవలం ఆపత్కాలములో ఆదుకొనదగిన సహాయకుడు ఒకే ఒక్కడు ఆయనే ప్రభువైన యేసుక్రీస్తు. మన బ్రదుకు దినములన్నియూ ఆయన యందలి భయభక్తులతో జీవిద్దాము.

అట్టి ధన్యత దేవుడు అనుగ్రహించును గాక !

(signature)

నవంబర్ - డిసెంబర్, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- (అ)సంతృప్తి ..... 2
- ఓ క్షణం నీ కోసం చదువుతావా? ..... 5
- ప్రతిఫలం (స్త్రీల ప్రత్యేకం) ..... 6
- శాశ్వతమైన ప్రేమ ..... 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 7వ భాగము ..... 10
- మంచి బహుమానం (బాలల శీర్షిక) ..... 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 13
- ఇది తెలుసా? (ఇథియోపియా) ..... 15
- డాక్టర్‌ని మీరెందుకు విజిట్‌చేయకూడదు ..... 16
- ఆత్మ ఫలము ..... 17
- నెబో పర్వతము ..... 18
- బైబిల్ క్విజ్-7 ..... 19
- జన్మదిన శుభాకాంక్షలు ..... 20


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227



# (అ) సంతృప్తి

- ఎడిటర్

**నేనేస్థితిలో ఉన్ననూ ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను. - ఫిలిప్పీ4:11**

సంతృప్తి కలిగిన వారి కంటే ధనవంతులు ఈ సృష్టిలో ఎవరూ లేరు. దేవుడు సృజించిన జీవరాశులలో పక్షులు ఆకాశంలో, చేపలు నీటిలో, జంతువులు అడవులలో సంతృప్తి కలిగి ఉన్నట్లుగా కనిపిస్తాయి. మరి మానవుని విషయంలో సంతృప్తి కలిగి ఉండుట అనేది ఏ విధంగా చూచిననూ కనబడదు. ఒక రకంగా అసంతృప్తి కలిగి ఉండడం అనేది దేవుని మీద తిరుగుబాటు చేయడం లాంటిది. సంతృప్తి కలిగి ఉండటం నేర్చుకొనవలసిన విషయము అని బైబిల్ గ్రంథం తెలియచేస్తుంది. ఒక వ్యక్తి ప్రతి రోజూ ఉదయమునే కొండకు వెళ్ళి కొండలోనుండి కొన్ని రాళ్ళు చెక్కుకొని వాటిని అమ్ముకొని సంతోషంగా జీవించేవాడు. అలా దినములు సంతృప్తిగా వెళ్ళబుచ్చేవాడు. ఒకరోజు ఒక ప్యాలస్‌లో రాళ్ళు కొట్టడానికి తీసుకువెళ్ళారు. ఈ వ్యక్తి రాళ్ళు కొడుతూ ఉండగా ప్యాలస్ యజమాని నీడలో కూర్చుండుట చూచి నాకు ప్యాలస్ ఉంటే బాధలు ఉండవుకదా అని అనుకుంటాడు, అతనికి ప్యాలస్ ఇవ్వబడుతుంది. ఆ ప్యాలస్‌లో రోజూ కూర్చొని ఉండుట ద్వారా విసుగు చెందుతూ, రాజ్యమును పరిపాలిస్తున్న రాజు గుఱ్ఱం మీద వీధులలో తిరుగుచుండగా చూసిన ఈ వ్యక్తి, రాజుగారిని ఇంతమంది వెంబడిస్తున్నారు, ప్యాలస్‌లో కూర్చోవటం కంటే రాజునైతే బాగుండును అనుకున్నాడు. రాజుగా మారి రోజూ గుఱ్ఱం మీద వీధులలో తిరుగుచూ ఉండగా ఎండ వేడిమిచేత అలసట చెంది ఈ జీవితం కంటే సూర్యుడిగా మారితే ఏ కష్టములు ఉండవు అనుకున్నాడు. సూర్యుడిగా మారిన తరువాత ఒక రోజు మేఘములు సూర్యుని యొక్క ప్రతాపమును అడ్డుకోవడం చూచి, సూర్యుని కంటే మేఘములుగా ఉండటమే మేలు అనుకొని, మేఘములుగా మార్పుచెంది సంతోషంగా ఉంది అని అనుకునే లోపు బలమైన గాలి వీచి మేఘములు తాకటం ద్వారా, మేఘముల కంటే గాలి గొప్పదని అనుకొని గాలిగా మార్పుచెంది నేను చాలా పవర్‌ఫుల్ అనికొంటుండగా ఒకరోజు ఎంత బలంగా గాలివీస్తున్నా, కొండ రాళ్ళలో చలనం లేకపోవడం చూచి, నా కంటే కొండరాళ్లే బలమైనవి అనుకొని కొండరాళ్ళగా ఉంటేనే బాగుండును అనుకున్నాడు. కొండరాళ్ళగా ఉంటుండగా ఒక రోజు ఉదయమునే కొండరాళ్ళని కొట్టడానికి ఒక మనుష్యుడు వచ్చి రాళ్ళని ముక్కలు ముక్కలుగా కొడుతుండగా కొండరాళ్ళ కంటే దానిని కొట్టే వ్యక్తిగా ఉండటమే శ్రేష్ఠము అనుకున్నాడు.

ఈ ఉపమానం మానవుని జీవితంలో సంతృప్తి లేకుండా జీవించే జీవితమునకు అద్దం పడుతుంది. మనం ఏ స్థితిలో ఉన్నప్పటికి ఆ స్థితిలో కొన్ని ఇబ్బందులు, సమస్యలు ఉండటం, అదే సమయములో మేలులు, అనుకూల అంశములు ఉండడం సాధారణం. కాబట్టి మనము ఉన్న స్థితిలో సంతృప్తి కలిగి ఉండటం కంటే భాగ్యం మరొకటి లేదు.

**ఈ క్రింది నాలుగు స్థితిగతులలో మనం ఏ విధంగా ఉండాలో తెలుసుకుందాము.**

**1. ఆరోగ్య స్థితి** (Health status)

నేటి సమాజములో వ్యాధులు అనేవి చాలా సర్వసాధారణమైనవి. చిన్నతనము నుండే పిల్లలకు కళ్ళద్దాలు అవసరమవడం, కొంచెం పెరిగి పెద్దవారయ్యేసరికి హైపర్‌టెన్షన్ (B.P.), మధుమేహం (Sugar), మరియు ఇతర ఆరోగ్య సమస్యలు, వీటన్నిటికి కొన్నిసార్లు మన ఆహారపు అలవాట్లు కారణమైతే మరికొన్నిసార్లు వంశ పారంపర్యంగా సంక్రమిస్తున్నాయి. క్రైస్తవ సమాజంలో ఒక అపోహ బలంగా నాటుకుపోయింది, అదేమిటంటే పాపాత్ములకే వ్యాధులు వస్తాయని, వ్యాధిగ్రస్తులు నీతిమంతులుకారని అనుకుంటూ ఉంటాము. పాపము వలన వచ్చు జీతము మరణము అని బైబిల్‌లో వ్రాయబడినప్పటికి, వ్యాధులను బట్టి మంచివారు, చెడ్డవారు అని తీర్పుతీర్చలేము. మన ఆరోగ్య స్థితి ఏదైనప్పటికి ఆ స్థితిని బట్టి అసంతృప్తితో నిరాశ చెందక ప్రార్థించుకొనుట మరియు ఆహారపు అలవాట్ల ద్వారా నెమ్మది కలిగి జీవించెదము.

**2. ఆర్థిక స్థితి** (Financial status)

నేడు సమాజమును ఎంతగానో ప్రభావితం చేస్తున్నది ఆర్థిక స్థితి. ఆర్థిక పరిస్థితులలో మనుష్యులు సంతృప్తి కలిగి ఉండుట నేర్చుకొనక తీసుకునే నిర్ణయములను బట్టి సమాజములో ఎన్నో అనర్థములు కలుగుచున్నాయి. ఒక మనుష్యుడు తన అవసరతల కంటే మించి ఎక్కువ కావాలని కోరుకోవడం విచిత్రంగా అనిపిస్తున్న వాస్తవం. ప్రతి మనుష్యుడు ఆర్థిక విషయములలో సంతృప్తి కలిగి ఉండగలిగితే మనము ఒక క్రొత్త ప్రపంచమును చూడగలుగుతాము. బైబిల్ గ్రంథములో పౌలు భక్తుడు దీనస్థితిలో ఉండనెరుగుదును, సంపన్న స్థితిలో ఉండనెరుగుదును అనే ఒక అద్భుతమైన సత్యమును తెలియపరుచుట జరిగింది. సంపద సమాజమును ఎంతో ప్రభావితం చేస్తుంది. నిజక్రైస్తవుడు తన జీవితంలో ఎల్లప్పుడూ అన్నవస్త్రములు గలవారై తృప్తి చెంది ఉండాలనేది దేవుని ఉద్దేశ్యం 1 తిమోతి 6:8. మన జీవితంలో శ్రేష్ఠమైన వాటిని కోరుకోవడంలో తప్పులేదు అయితే మనము ఉన్న స్థితిని బట్టి అసంతృప్తి కలిగి ఉండకూడదు.

**3. సామాజిక స్థితి** (Social status)

మనిషి జీవితంలో కావలసిన ఆహారం, వస్త్రములను దేవుడు అనుగ్రహించినప్పటికీ, సామాజిక హోదా కొరకు ఎంతగానో వెంపర్లాడటం కనబడుతుంది. సామాజిక హోదా కొరకు తమకి కలిగిన వాటిని మాత్రమే కాక ప్రాణములను కూడా పోగొట్టుకొనిన వారు ఎందరో ఉన్నారు. చరిత్రలో సామాజిక హోదా కొరకు ఎన్నో యుద్ధములు, పోరాటములు జరుగుట మనము చూస్తాము. మంచి సామాజిక హోదా కలిగి ఉండాలని ఆశించడం తప్పు అని అనలేము కానీ ఉన్న స్థితిలో అసంతృప్తి కలిగి ఉండడం, ఖచ్చితంగా దేవునికి దుఃఖమును

కలిగించడం. అసంతృప్తి కలిగి ఉండుట వలన సామాజిక హోదాలో ఎటువంటి మార్పు ఉండకపోగా, మన ఆనందమును ఎంతో పాడు చేస్తుంది. సమాజం మనలను గౌరవించే విధానమును బట్టి మన వ్యక్తిత్వం మార్పు చెందకూడదు. మనము స్థిరమైన వ్యక్తిత్వం గల వారమై యుండి మనము ఉన్న సామాజిక స్థితిలో సంతోషించే వారిగా ఉండాలి. ఒకానొక సమయంలో రాజైన దావీదు ప్రజలందరి వలన ఎంతో ఘనత పొందినవాడైనప్పటికి, ఒక దినమున షిమీ అనే సామాన్యమైన వ్యక్తి నరహంతకుడా ! దుర్మార్గుడా ! ఛీ ఛో, ఛీ ఛో అని దూషిస్తున్నప్పటికీ, అసంతృప్తితో అతనిని శిక్షించిన వాడు కాదు కానీ, చుట్టూ ఉన్నవారు శిక్షించెదమని అన్నప్పటికీ దేవుడే తనను దూషణలకు అప్పగించాడేమోనని సంతృప్తి చెందినట్లుగా మనము చూస్తాము.

**4. ఆత్మీయ స్థితి** (Spiritual status)

ఒక మనుష్యుడు నూతన జన్మ అనుభవములు కలిగి ఉండుట ద్వారా ఆత్మీయ స్థితి ప్రారంభమవుతుంది. ఆత్మలో తగ్గటం, ఎదగటం ఆత్మీయ జీవితంలో సాధారణమైనవే. అయితే ఆత్మలో అంతకంతకూ ఎదగాలని మనము కోరుకోవాలి కానీ వేరొకరితో సరిపోల్చుకుంటూ అసంతృప్తి కలిగి ఉండకూడదు. మనకి అనుగ్రహించిన కృప చొప్పున వేర్వేరు కృపావరములు కలిగి ఉన్నాము కానీ ఘనమైనదని, హీనమైనదని భావించటం సమంజసం కాదు. బైబిల్ గ్రంథములో యేసుప్రభువు చెప్పిన అనేక ఉపమానములను మనం పరిశీలిస్తే, తనని తాను హెచ్చించుకొనువాడు తగ్గించబడును, తగ్గించుకొనువాడు హెచ్చింపబడుననియు, తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను అని బైబిల్ గ్రంథములో యేసుప్రభువు అనేక ఉపమానములు చెప్పటం జరిగింది. మన ఆత్మీయ స్థితిని బట్టి ఎన్నడు అసంతృప్తితో జీవించకుండా, ఉన్న ఆత్మీయ స్థితిని బట్టి సంతృప్తి కలిగి, మనం కోరుకునే ఆత్మీయస్థితిని గూర్చి నిరీక్షణ కలిగి ఆనందముతో జీవించవలసిన వారమై యున్నాము.

ప్రియమైన చదువరీ ! అన్ని విషయములలో సంతృప్తి కలిగి ఉండడం అనేది నేర్చుకొని ఉన్నాను అని పౌలు భక్తుడు సెలవిచ్చుట జరిగింది. మనము కూడా సంతృప్తి కలిగి యుండుట నేర్చుకొనవలసి ఉన్నది. సంతృప్తి కలిగి ఉండుటలో ఎంతో గొప్ప ఆనందం ఉన్నది. సంతృప్తి కలిగి ఉండుట అనగా అసమర్థత, చేతగానితనం అనుకుంటే పొరపాటు. అసంతృప్తితో మనం ఉండుట వలన మన సామర్థ్యం తగ్గిపోతుందే కానీ, ఎక్కువ కాదు. మంచి నిర్ణయములు తీసుకొనవలసిన సమయములో చెడ్డనిర్ణయములు తీసుకుంటాము. కఠినమైన మాటలు పలుకుతూ ఉంటాము. సంతృప్తి కలిగి ఉండుట నేర్చుకొనుట ద్వారా మన ప్రాణమునకు నెమ్మది దేవుని దృష్టిలో నిర్దోషులముగా ఉండగలుగుతాము. అట్టి ధన్యతను దేవుడు మనకి దయచేయును గాక !

# ఓ క్షణం నీ కోసం చదువుతావా ?

1. నువ్వు అనవసరమైన మాట పలికే ముందు
   – మాటలు రాని వారి గురించి ఆలోచించు

2. నువ్వు తీసుకునే ఆహారానికి పేర్లు పెట్టే ముందు
   – తినడానికి ఆహారం కూడా దొరకని వారి గురించి ఆలోచించు

3. (నీ) భార్య లేక భర్త లోపములను ఎత్తి చూపే ముందు
   – వారిని కోల్పోయి బాధలు పడుచున్న వారి గురించి ఆలోచించు

4. నీవు నివసిస్తున్న ఇంటిని అసహ్యించుకునే ముందు
   – వీధులలో, రోడ్ల మీద నివసిస్తున్న వారి గురించి ఆలోచించు

5. నువ్వు కొంచెం దూరం నడవడానికి సణుగుకునే ముందు
   – అదే దూరమును కూడా నడవలేని వారి గురించి ఆలోచించు

6. నువ్వు చేసే పని విషయములో అలసిపోయి దూషించే ముందు
   – ఆ పనికూడా లేక నిరుత్సాహంతో ఉన్న వారి గురించి ఆలోచించు


7. నీ జీవితం గురించి అభ్యంతరపడే ముందు
   – ఇబ్బందులతో జీవితమును కొనసాగిస్తున్న వారి గురించి ఆలోచించు

జీవితము అనేది దేవుడు మనకి అనుగ్రహించిన విలువైన బహుమతి. దానిని ప్రేమించి, పరిపూర్ణము చేస్తూ, దానిలో జీవించాలి.

# ప్రతిఫలం

- సిస్టర్ విజయ

బైబిల్ గ్రంధములో రూతు, ఓర్పా అనే మోయాబీయులు దేవునిని ఎరుగని సంతతికి చెందిన స్త్రీలు. యూదా బెత్లెహేము నుండి మోయాబు ప్రాంతమునకు వలస వచ్చిన కుటుంబములోనికి కోడళ్ళుగా వెళ్ళిననూ వైవాహిక జీవితంలో సంతోషం అనుభవించకుండానే భర్తలను కోల్పోయారు. వీరి అత్త అయిన నయోమి కూడా భర్తని



కోల్పోయి ఆ కుటుంబ ములోని ముగ్గురు స్త్రీలు మగదిక్కు లేకుండా ఒంటరి వారయ్యారు. అప్పుడు వారి అత్తయైన నయోమి తిరిగి యూదా బేత్లహేముకు ప్రయాణమవ్వగా కోడళ్ళు కూడా ఆమెను వెంబ డించారు. మార్గమధ్యంలో తన ఇద్దరి కోడళ్ళను చూచి మీరు నా కుమారుల యెడల, నా యెడల దయ చూపినట్లు దేవుడు మీ యెడల కూడా దయచూపును గాక ! మీరు వెళ్ళి మరల వివాహములు చేసుకొని, నెమ్మదిగా ఉండమని చెప్పింది. ఇద్దరూ ఎలుగెత్తి ఏడ్చారు. ఓర్పా తన అత్తను ముద్దు పెట్టుకొని తన తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. చిన్న కోడలైన రూతు ఆమెను హత్తుకొని పలికిన మాటలను పరిశీలించినప్పుడు :-

**1. నా వెంబడి రావద్దనియు, నన్ను విడిచిపెట్టుమనియు:-**

అత్తయైన నయోమి చాలా కష్టకాలంలో ఉంది. ఆమె వృద్ధాప్యంలో ఉన్న ఒంటరి స్త్రీ. తనని తాను పోషించుకోలేదు. రూతుకు ఏ మాత్రమూ ఉపయోగపడదు. తోటికోడలి వలె వెనుకకు తిరిగి వెళ్ళిపోవాలని ఆలోచించలేదు కానీ ఈ కష్ట సమయములోనే ఆమెను హత్తుకొని ఆమె బాధ్యతను తీసుకోవాలని, వెంబడి వెళ్ళాలనే నిశ్చయించుకుంది. మనము కూడా అనారోగ్య పరిస్థితులలో, కష్ట సమయములలో ఉన్న మన అత్తమామల గురించి శ్రద్ధ, బాధ్యతను తీసుకొని పరామర్శించి, ప్రేమ, ఆదరణను చూపించే వారిగా ఉండాలి. నేనే ఉన్నానా బాధ్యత తీసుకోవటానికి, చేసిపెట్టడానికి అని వంతులు వేసుకొని, వారి మనసులను కష్టపెట్టక, రూతు ఏ విధంగా అత్త వెంబడి వెళ్ళటానికి ఇష్టపడిందో ఆ విధంగా

ఇష్టపడేవారిగా ఉండాలి.

**2. నీవు వెళ్ళు చోటికే నేను వచ్చెదను, నీవు నివసించు చోటనే నేను నివసించెదను**



రూతు అంతకు ముందు ఎన్నడూ యూదా బేత్లెహేము ప్రాంతమును చూడలేదు, ఆమె పుట్టి పెరిగిన ప్రదేశము వేరు. భర్త ఉంటే తప్పనిసరిగా ఆ ప్రాంతమునకు వెళ్ళవలసి ఉండేది కానీ, అతను లేడు, అవసరత లేదు కానీ అత్తతో ఆమె వెళ్ళే చోటికి వెళ్ళటానికి, నివసించే చోటులో నివసించటానికి సిద్ధపడింది. మనము అవసరత ఉన్నా వెళ్ళటానికి ఇష్టములేని వారముగానే ఉంటున్నాము. క్రొత్తలో ప్రేమగా, అప్యాంగానే ఉంటారు కానీ సంవత్స రములు గడుచుచున్న కొలది ఒకరి బలహీనతలు ఒకరు చూసుకొని మనసులలో ద్వేషం, కోపం అనేవి పెంచుకొని ఒకరిని ఒకరు సహించుకోలేని స్థితిలోనికి వస్తారు. దీనంతటికి భిన్నంగా రూతు మాత్రం భర్త లేకపోయిననూ, అత్తతో కలసి నివసించటానికే ఇష్టపడింది. కానీ ఈ దినము అనేకులు ఇది నాది, నా కుటుంబము, నేను, నా భర్త, పిల్లలు అని ఆలోచించే వారిగానే ఉంటున్నాము కానీ వారు లేకుండా నా భర్త ఎక్కడ నుండి వచ్చాడు? వారు కూడా నా కుటుంబములో ఒక భాగమే అనే ఆలోచనతో ఉన్నవారిని దేవుడు నెమ్మదితో నిలిపి, వర్ధిల్లచేస్తారు.

**3. నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు:-**

రూతు ఆ జనమును, దేవునిని చూడలేదు, ఎరుగలేదు. అక్కడి జనులు ఆదరిస్తారో లేదో తెలియని పరిస్థితులలో కూడా నీ జనమే నా జనము అని చెప్పుచున్నది. దేవుని గురించి తెలియకపోయిననూ నీ దేవుడే నా దేవుడు అని చెప్పి ఆమెను ధైర్యపరుస్తుంది. దేవునిని ఎరిగిన మనము నీ వారు, నా వారు అని వేరుగా మాట్లాడే స్వభావము ఉండకూడదు. దేవునిని ఎరుగని ఆమె తన అత్తయైన నయోమితో నీ జనమే నా జనము అని హత్తుకుంటుంటే మనము ఇంకా వారి లోపములను, బలహీనతలను మాటి మాటికి ఎత్తి చూపిస్తూ ఇంట్లో వారిని దెప్పిపొడిచే స్వభావము ఎంత మాత్రమూ మంచిది కాదు. ప్రతి కోడలు తన అత్తకు సంబంధించిన వారిని ప్రేమ, ఆప్యాయతలతో పలుకరించి, వారికి మేలు చేస్తూ నీ జనమే నా జనము అనే విధంగా జీవించాలి.

**4. మరణము తప్ప నిన్ను నన్ను ఏది వేరు చేసిననూ యెహోవా నాకు కీడు చేయును:-**

ఎంత త్యాగపూరితమైన మాటను రూతు పలికింది. మరణమే మనల్ని వేరు చేసేది అని తన మాటల ద్వారా అత్తకి ఎంతో ధైర్యం చెబుతుంది. ఈ రోజు మన మాటల ద్వారా వారికి ధైర్యం కాదు కదా, వారికి ఉన్న ధైర్యమను కూడా పోగొట్టేవారిగా, భయాందోళనలను కలుగజేసేవారిగానే ఉంటున్నాము. మరణము తప్ప నిన్ను నన్ను ఏదీ వేరు చేయదు అని రూతు చెబుతుంటే ఈ దినములలో అనేకులు మరణము వచ్చి ఎప్పుడు వేరు చేస్తుందా? మనము ఎప్పుడు స్వేచ్ఛగా ఉంటామా? అని ఎదురు చూచేవారిగా ఉంటున్నారు. సంపాదించి తెచ్చింది అంతా ఖర్చు పెడితే నేను నా పిల్లలు ఏమై పోవాలి ? మీకు చాకిరి చేయలేకపోతున్నాను అని అభ్యంతరపడే మాటలతో వారిని మనస్సును కష్టపెట్టేవారముగా ఉంటున్నాము. కానీ మన మాటలు, ఆలోచనలు, క్రియలు, ప్రవర్తన వాక్యానుసారముగా ఉన్నదా! లేదా! అని పరిశీలించుకునే స్థితి ఎంత మాత్రమూ లేదు అంటే అతిశయోక్తి కాదు. మనమే వారిని నిర్లక్ష్యపెట్టి, స్వార్థంతో నష్టము కలుగచేసు కుంటున్నాము.

ఈ విధంగా రూతు అత్తతో నిబంధన చేసినప్పుడు నయోమి తనతో కూడ యూదయ బెత్లెహేమునకు తీసుకొనివెళ్ళెను. అక్కడికి వెళ్లిన తరువాత నయోమి దూరపు బంధువు అయిన బోయజు అను వ్యక్తి యొక్క పొలములో పరిగి ఏరుకుంటూ తనని, తన అత్తని పోషించుకుంటూ జీవిస్తున్న సమయములో రూతు జీవితమును దేవుడు విడిచిపెట్టలేదు. సిగ్గుపరచలేదు. భవిష్యత్తు ఎలాఉంటుందో తెలియని అగమ్యగోచరమైన స్థితిలో ఆమె జీవితంలో దేవుడు అద్భుతం చేసాడు. బోయజు అనే వ్యక్తి వివాహము చేసుకొనుట ద్వారా యేసుక్రీస్తుని ఎరుగని ఈమె ఆయన పుట్టిన వంశావళి జాబితాలో చేర్చబడింది. ఆహా! ఎంత గొప్ప ధన్యత. ఏడుగురు కుమారుల కంటే ఎక్కువైన కోడలు అని సాక్ష్యం పొందెను.

మనము దేనిని విత్తితే ఆ పంటనే కోసుకుంటాము అని చెప్పబడినట్లుగా ఏది విత్తుకోవాలో అది మన చేతులతోనే ఉంది. బాధ్యతను మనము తీసుకొని, కనికరము చూపించుటవలన తగిన ప్రతిఫలము దేవుడు మనకి అనుగ్రహిస్తాడు.

అట్టి ధన్యత దేవుడు మనకు అనుగ్రహించును గాక!


# శాశ్వత ప్రేమ

అమ్మా ! ఈ రోజు సాయంకాలం నా స్నేహితురాళ్ళు వస్తున్నారు. 4 గంటలకల్లా టీ, స్నాక్స్ సిద్ధము చేసి నన్ను పిలిస్తే నేను వచ్చి అన్నీ తీసుకొని వెళతాను. నువ్వు మాత్రము నా స్నేహితురాళ్ళకు కనబడకూడదు అని కవిత తన తల్లి శాంతమ్మకు చెప్పింది.

అనుకున్నట్లుగానే కవిత స్నేహితురాళ్ళు వచ్చారు. తల్లి శాంతమ్మ తయారు చేసిన గారెలు తింటూ అబ్బా ! ఈ గారెలు ఎవరు చేసారే ? భలే రుచిగా ఉన్నాయి అని మాట్లాడుకుంటూ ఉండగా, టీ పట్టుకొని తలుపు వెనుక ఉన్న శాంతమ్మ పొగడ్తలు వినగానే "నేనే చేసానంటూ" ముందుకు రాగా, సంతోషముతో ఉన్న స్నేహితురాళ్ళు ఈమె ఎవరు ? అని కవితను అడిగారు. కోపముతో గుడ్లెర్ర చేసిన కవిత "వంటమనిషి" అని కఠినంగా చెప్పింది ఈ మాట పిడుగులా శాంతమ్మ హృదయంలో పడగా గిర్రున వెనుతిరిగి వంటగదిలోకి చేరి ఏడ్చుచుండెను.

స్నేహితురాళ్ళను పంపివేసిన కవిత తల్లి దగ్గరకు వచ్చి, "నీలాంటి తల్లి ఉన్నా ఒకటే, చచ్చిపోయినా ఒకటే", కాలిపోయి వికృతంగా మారిన ముఖము, చేతులతో నా స్నేహితురాళ్ళ ఎదుటికి రావద్దు అంటే వచ్చి నా పరువు తీసావు అనెను. కూతురి మాటలకు కుమిలిపోతూ ఏడుస్తున్న ఆ తల్లి, అమ్మా! నేను చెప్పే ఒక మాట విను, నీవు పసికందుగా ఉన్నప్పుడు నీ తండ్రి చనిపోయాడు. కష్టపడి నిన్ను పెంచుతూ ఉండగా ఒక దినము నీళ్ళకు వెళ్ళి ఇంటికి వచ్చేటప్పటికి మన ఇల్లు నిప్పంటుకొని కాలిపోవుచున్నది. అయ్యో! నా బిడ్డ! రక్షించండి అని కేకలు వేసాను గాని ఎవరును నిన్ను రక్షించుటకు ముందుకు రాలేదు. అప్పుడు నేనే తెగించి కాలిపోతున్న ఇంటిలోనికి వెళ్ళి నిన్ను కౌగిటిలోకి చేర్చుకొని బయటకు పరిగెత్తాను. ఈలోగా మంటల వలన నా ముఖము చేతులు కాలిపోయి ఇలా వికృతమయ్యాయి, కానీ నిన్ను రక్షించుకున్నాననే సంతోషంతోనే ఇంతకాలం బ్రతికానమ్మా అన్న తల్లి మాటలు వినగానే కవిత తల్లి పాదములపై కుప్పకూలిపోయింది. "అమ్మా! నన్ను క్షమించు నీ ప్రేమను, త్యాగమును ఎరుగక దూషించాను. ఇక నిన్ను గురించి సిగ్గుపడక లోకమంతటికి నా తల్లి ప్రేమను తెలియచేస్తాను" ! అనెను.

ధనవంతుడైన, అతిశ్రేష్ఠుడైన యేసుప్రభువు మనల్ని ఎంతగానో ప్రేమించెను. మన పాపముల కొరకు ఆయన సిలువలో తన స్వరూపమును, సొగస్సును కోల్పోయి, ప్రాణములను అర్పించారు. ఈ దినము సమాజములో దేవుని యొక్క ప్రేమను చులకనగా చూచి, అర్థము చేసుకొనని వారే ఎక్కువగా కనబడుచున్నారు. అదే విధముగా దేవునిని ఎరిగిన వారు కూడా యేసుప్రభువుని నమ్ముకున్నామని చెప్పుకుంటే సమాజము చిన్నతనముగా చూస్తుందని, పరిశుద్ధ గ్రంథమును బహిరంగముగా పట్టుకోవటానికి కూడా జంకుతున్నారు. బాహ్యరూపము వలన ఎక్కడ క్రైస్తవులుగా కనబడతామో అని అన్యుల అలంకరణల వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ యేసుక్రీస్తు ప్రేమను, త్యాగమును అర్థము చేసుకున్న వారమైతే ఆయన నామమును ద్వేషించక, చిన్నతనముగా భావించక దేవుని కొరకు జీవించాలనే ఆశను కలిగి ఉంటాము. తల్లి వికృత రూపమును చూచి ద్వేషించింది కానీ ఆమె ప్రేమను, త్యాగమును అర్థము చేసుకోలేకపోయింది ఆమె కుమార్తె. ఆ విధముగానే మనము కూడా ఆయన ప్రేమను అపార్థము చేసికొనక అర్థము చేసుకొని ఆయన కొరకు సాక్షులుగా జీవించాలి.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 7వ భాగము**

సుందర్ బైబిల్ చదువుచున్నాడనీ, రహస్యంగా యేసుప్రభువుకు ప్రార్థిస్తున్నాడనీ, హిందువులు గాని, సిక్కులు గాని చేసే పూజలలో పాలుపొందగూడదని వారి గుళ్ళకు వెళ్ళగూడదని సుందర్ చేసికొన్న నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని తెలియడంతో ఇంటి వారి వైఖరి పూర్తిగా మారిపోయింది. అతని మనస్సు మార్చడానికి శత విధాలా ప్రయత్నించారు. కుటుంబంలో మిగిలిన వారందరూ ఒకేచోట చేరి రుచికరమైన రకరకాల వంటకాలతో సరదాగా భుజిస్తుంటే తానొక్కడే ఒంటరిగా వరండాలో కూర్చుని భోంచేస్తుంటే ఎలా ఉంటుందో సుందర్‌కు తెలిసొచ్చేట్లు చేసారు. కొంతమంది ఎగతాళి చేసేవారు, మరికొంతమంది అతనిని క్రైస్తవ్యంలో నుండి బయటకు తీసుకురావాలన్న ధ్యేయంతో వాదించేవారు. ఈ దశలో మహారాజాగారి దర్బారులో పనిచేస్తున్న ఒక బంధువు ఇంటికి సుందర్‌ని పంపించారు. ఆ బంధువు సుందర్‌ని మహారాజు దగ్గరికి తీసుకొని వెళ్ళాడు. మహారాజా వారు నచ్చజెప్పే విధముగా సుందర్‌తో మాట్లాడుచూ సిక్కుగా ఉండడమంటే ఎంత ఘనతో, ఎంత గౌరవమో అదీ గాక సిక్కులలో సింగ్(సింహం) వంశంలో పుట్టడం ఎంత గౌరవ కారణమో చెప్తూ సిక్కుల ఐదు చిహ్నాలైన కృపాణము, చేతికడియము, పెద్దలాగుల, తలలో పెట్టుకొనే చిన్న దువ్వెన ఇవన్నీ కాకుండా పుట్టినది మొదలుకొని కత్తిరించకుండా పొడవుగా పెంచే తల వెంట్రుకలు ఇవన్నీ మనకు గర్వకారణమైనవని చెప్పాడు సుందర్‌కి. మహారాజు దగ్గర ఎంతో వినయంగా నిలబడి ఇవన్నీ విన్న సుందర్ క్రీస్తు నందు తనకున్న విశ్వాసం నుండి కొంచెమైననూ తొలగకపోవడంతో రౌద్రుడైపోయిన రాజు నీవు అసలు సింహానివే కాదు, నక్కవి అని వెటకారంగా మాట్లాడి పంపించివేసాడు. రాజు సముఖం నుండి ఇలా అవమానంతో పంపివేయబడడంతో సుందర్ బంధువు కూడా అతని యెడల తన కోపమును బాహాటముగా వెల్లడించాడు. 15 సం॥ల వయస్సు ఉన్న ఈ కుర్రవాని మనోవిశ్వాసమును తొలగించకపోయినప్పటికిని అతని నోరు మూయించడానికి నలుదిక్కుల నుండి వచ్చిన వత్తిళ్ళు చాలు. అయితే సుందర్ విషయములో అంతా భిన్నంగా జరిగింది.

సువార్తలను, అపోస్తలుల కార్యములను చదువుచుండినప్పుడు తన కళ్ళముందే సాక్ష్యాత్కరించిన అద్భుతమైన క్రీస్తు అవమానమును, శ్రమలను ఎలాగు సహించినది

యేసునామము నిమిత్తము శ్రమ ననుభవించుటకు యోగ్యులుగా యెంచబడినందుకు శిష్యులెంతగా సంతోషించినది చదివిన సుందర్‌లో క్రీస్తు కొరకు శ్రమపడాలనే కోరికను బలపరిచింది. ఒకానొక దినమున సుందర్ పెద్దవాడయ్యాడని అతడొక సిక్కుమతస్తుడనీ తెలిపే వేడుకలో పాలుపొంది వారు చేయమనే పనులన్నీ చేయడానికి సుందర్ అంగీకరించలేదు. అయితే తన జాతిని, పితరులను వదిలి వేయాలనేది అతని ఉద్ధేశ్యము కాదు. సిక్కుమతమును మాత్రమే అతడు త్యజించాడు. లూధియానాలోని స్కూలులో తన భ్రమలు తొలగజేసిన సంఘటనలు, బెదిరింపులు తాను పొందిన నిరాదరణ, తండ్రి ఇంకా ఇంటిలో మిగిలిన పెద్దలు తనను బ్రతిమాలడం ఇవన్నీ తనకు ప్రత్యక్షమైన సజీవుడైన క్రీస్తును మర్చిపోయేలా చేయలేవని సుందర్‌కి తెలుసు.

తాను సిక్కు మతమును శాశ్వతంగా విసర్జించానని, క్రీస్తును చూసానని, ఆయననే వెంబడించడానికి తాను నిర్ణయించుకున్నానని కుటుంబములోని వారందరూ ఖచ్చితంగా తెలిసికొనేటట్లుగా యేదో ఒకటి చేయాలనుకున్నాడు సుందర్. ఈ ఆలోచనంతటినీ కార్యరూపంలో పెట్టడానికి తనకు ఓ ఆలోచన తట్టింది. ఆ ఒక్క పనీ చెయ్యడంతో సిక్కు మతానికి, జాతి కట్టుబాట్ల నుండి తన్ను తాను విముక్తునిగా చేసుకోవచ్చునని తలంచాడు సుందర్. అది ఎంతో స్వల్ప కార్యమైనను తిరుగు లేనిది. ఈ పని చేయడం వలన తాను ఇంత వరకు ఎదుర్కొన్న కష్టముల కంటె మించిన కష్టములను ఎదుర్కొన వలసి వస్తుందని సుందర్ గుర్తించాడు. అయినా సరే, ఆ పని చేయడానికి తన మనస్సును దృఢపరచుకొని వెంటనే ఓ కత్తెర తీసుకొని పొడవుగా ఉన్న తన తల వెంట్రుకలను కత్తిరించి వేసాడు సుందర్.


– సేకరించబడినది. –(ఇంకా వుంది)


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - 2010**

నూతన సంవత్సర కాలెండర్స్ కొరకు సంప్రదించండి.

బ్రదర్. **పి.రవీందర్,**

ఎపఫ్రా మినిస్ట్రీస్, హైదరాబాద్. సెల్: 99631 17628



# మంచి బహుమానం

Hai Children! Happy Christmas. ఏంటి అలా ఆశ్చర్య పోతున్నారు? అప్పుడే విషెస్ చెప్పేస్తున్నాననా? అద్వాన్సుగాలే. మళ్ళీ క్రిస్మస్ అయ్యాకే కదా కలుస్తాము అందుకని! ఇంతకీ మీకు క్రిస్మస్ అంటే ఏమిటో తెలుసా? యేసయ్య birthday కదా! మీ birthdays అంటే మీకు చాలా ఇష్టం కదా! మీ friends birthdays కూడా happy గా enjoy చేస్తారు. అందరూ మంచి మంచి gifts ఇస్తారు. Party చేసుకుంటారు, happyగా celebrate చేసుకుంటారు కదా! మరి మన యేసయ్య birthdayకి ఏం gift ఇద్దామనుకుంటున్నారు?

మనం ఎవరికైనా gift ఇచ్చేటప్పుడు ఏం ఆలోచిస్తాము? ప్రతి రోజు వారు సంతోషంగా ఉండాలని, వారికి సంతోషమును కలిగించేది మనం gift గా ఇస్తాము. వారి సంతోషమునకు కారణం మనమే కావాలని కోరుకుంటాము కదా! same ఒక church లోని పిల్లలు కూడా ఈ విధంగా ఇలా మాట్లడుకుంటున్నారు.

అన్నయ్య! క్రిస్మస్ వచ్చేస్తుంది, ఈ క్రిస్మస్ grand గా celebrate చేసుకుందామా! అడిగింది స్వీటీ, ప్రేమ్‌ను. అవును స్వీటీ grand గా ఉండాలనే plan చేస్తున్నాను. శ్యామ్, నేను shopping కి వెళ్ళి star, christmas tree, greetings, baloons అన్నీ కొనుక్కుని వస్తాము. చర్చిని clean చేద్దాము. అప్పుడు యేసయ్యకు భలే సంతోషం కదా! అన్నయ్యా! అందరూ కూడా సంతోషిస్తారు కదా! ప్రేమ్! పద shopping కి వెళదాం shopping కి, అన్నాడు శ్యామ్. ఆ ! అలాగే స్వీటీ మీరంతా చర్చిని clean చేసి ఉంచండి, మేము వచ్చాక decorate చేద్దాము అని ప్రేమ్ శ్యామ్‌ను తీసుకొని వెళ్ళిపోయాడు. పిల్లలు అందరూ చర్చిని clean చేసి చాలా బాగా అలంకరించారు, రకరకాల వస్తువులతో ఆ చర్చి చూడటానికి చాలా అందంగా, సంతోషమును కలిగిస్తుంది. శ్యామ్‌కి ఇంకా ఏదో చేయాలని ఆలోచిస్తుంటే ఒక వాక్యం గుర్తుకు వస్తోంది "బలులు అర్పించుట కంటె మాట వినుట శ్రేష్ఠము" వెంటనే బైబిల్ తీసి 1 సమూ 15:22 వచనం చదివి, మోకరించి ఈ విధంగా యేసయ్యతో చెబుతున్నాడు. యేసయ్యా! నీ మాట వినకుండా నా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాను. నన్ను క్షమించు, పూర్ణహృదయంతో యేసయ్యను ప్రేమించుట, తల్లి దండ్రులను సన్మానించుట, పొరుగువారిని ప్రేమించుట అనే, మీ ఆజ్ఞలు గైకొంటాను తండ్రీ, నా హృదయం నీకిస్తున్నాను. నీకు ఇష్టం లేనివి ఇకనుండి చేయను ప్రభువా, నీవు ఏ విధంగా జీవించావో అలానే నేను కూడా నీ కొరకు జీవిస్తాను. నా కొరకు జన్మించి, సిలువ మరణం పొందిన నీ కొరకు నా హృదయము గిఫ్ట్‌గా ఇవ్వాలని తలంచి యేసునామమున ప్రార్థిస్తున్నాను తండ్రీ ! ఆమెన్ !



పిల్లలూ! మనము ఆయనను సంతోష పెట్టటానికి కానుకలిస్తాము, చర్చికి వెళతాము, చర్చిని అందంగా అలంకరిస్తాము కానీ ఆయన మాట మాత్రం వినట్లేదు. ఆయన ఆజ్ఞలు చేయటమే ఆయనకిష్టం. మనం ఎన్ని చేసినా వేస్ట్. శ్యామ్ వలె మన హృదయాన్ని ఆయన రక్తంతో శుద్ధి చేసుకొని ఆయన మాట చొప్పున చేయటమే ఆయనకి సంతోషాన్ని కల్గిస్తుంది. ఒకవేళ నీవు తప్పుచేస్తుంటే మోకరించి కన్నీళ్ళతో యేసయ్యకు ప్రార్థించు! విరిగి నలిగిన హృదయమే నాకిష్టమైన బలి అన్నాడు కదా! మరి మీ హృదయములను గిఫ్ట్‌గా ఇస్తారు కదా! bye children ......

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

**- రూఫస్, కందుకూరు**

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు. నా పేరు రూఫస్, మాది నల్గొండ జిల్లా, కందుకూరు గ్రామము.

నేను ఒక నామకార్థ క్రైస్తవ కుటుంబములో పెరిగాను. మా కుటుంబ పరిస్థితులను బట్టి 10వ తరగతి వరకు చదివిన తరువాత కొద్ది రోజులు చదువు ఆపేసాను. అమ్మా నాన్న వాళ్ళు కష్టపడుతుంటే చదువుకోవాలనే మనసు లేక నేను కూడా ఏదో ఒక పనికి వెళ్తూ ఉండే వాడిని, అయినా పూట గడవడం చాలా కష్టంగా ఉండేది. మా అన్నయ్య ఇంట్లో ఏమీ పట్టించుకునే వాడు కాదు. నేను కట్టెలు కొట్టి అమ్మగా వచ్చిన డబ్బులతో కుటుంబమును పోషించేవాడిని.

1992వ సంవత్సరములో ఐ.టి.ఐ లో జాయిన్ అయ్యాను, ఆ సంవత్సరంలోనే మారుమనస్సు పొంది రక్షించబడ్డాను. ఆరు నెలల తరువాత చదువు మధ్యలో మానేసి, పని కోసమని కర్నాటక వెళ్ళాను. మరల 1995వ సం॥లో ఉషాకిరణ్ మూవీస్ వారు ఇచ్చిన యాడ్‌ని పేపరులో చూచి, ఏదైనా హెల్పర్‌గా జాయిన్ అవుదామని హైదరాబాద్ వచ్చాను కానీ వాళ్ళు నీ సర్టిఫికెట్స్ ఇచ్చి వెళ్ళు, ఏమైనా ఖాళీ ఉంటే చెబుతాము అని అన్నారు. తిరిగి ఇంటికి వెళ్ళినా చేసే పని ఏమీ లేక అక్కడే ఫ్లోర్‌టైల్స్ (నాపరాళ్ళు) వేసే పనిలో చేరాను. ఆ తరువాత 1996 జనవరి 2వ తేదీన ఒక ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో మెకానిక్ హెల్పర్‌గా కాంట్రాక్ట్ మీద జాయిన్ చేసుకున్నారు. రోజుకి జీతం 28 రూ॥లు మరియు 12 గంటల డ్యూటీ. రామోజీ ఫిల్మ్‌సిటీ గేటు దగ్గర ఉన్న కొండ మీదే గుడిసె వేసుకొని ఉంటూ, జీతం సరిపోక నూకలు తెచ్చుకొని వండుకొని తిన్న రోజులు చాలా ఉన్నాయి. 1996 ఏప్రియల్‌లో కంపెనీ ఎంప్లాయిగా తీసుకొని నెలకు 2000 రూ॥ జీతం ఇచ్చేవారు.


1996 ఏప్రియల్ 7వ తేదీన నాకు వివాహం జరిగింది. అప్పటి నుండి మాకు చాలా ఇరుకులు, ఇబ్బందులు కలిగేవి. అప్పుడు అక్కడ ఒక చర్చికి వెళ్ళేవారము అయిననూ సరియైన సమాధానం లేక, నామకార్థ స్థితిలో మార్పు లేకుండానే జీవించేవారము. మాకు ఒక బాబు పుట్టిన తరువాత, బాబుకి నిమ్ము వచ్చి అనేక ఇబ్బందులు పడ్డాము అయినా దేవుడు ఎంతో సహాయం చేసి, మంచి ఆరోగ్యమును దయచేసారు. 1999లో మా అమ్మకు కడుపులో గడ్డ కోసం ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. అప్పుడు కూడా దేవుడు సహాయం చేసి కృప చూపాడు. 2001వ సం॥లో ఎపఫ్రా మినిస్ట్రీస్ పరిచర్యలో మొట్టమొదటి ఉపవాస ప్రార్థన జనవరి 26న జరిగింది. నేను ఆ ప్రార్థనలో పాలుపొందాను. ఇదే నా జీవితములో మొట్టమొదటి ఉపవాస ప్రార్థన. తినడానికి తిండి లేక ఎన్నో రోజులు ఆకలితో ఉన్నాము కానీ, దేవుని కొరకు ఉపవాసం ఉండాలని తెలియదు. ఉపవాస ప్రార్థనలో మొదట కొద్దిగా ఉండిననూ తుదకు మహాభివృద్ధి చెందుతామనే వాక్యమును వాగ్దానముగా దేవుడు మాతో మాట్లాడారు. 2002వ సం॥లో మాకు ఒక బాబు పుట్టి చనిపోయిననూ దేవుడు ఆయన కృప ద్వారా కనికరించి ధైర్యమును కోల్పోకుండా నిలబెట్టారు.


2003లో నాకు యాక్సిడెంట్ అయ్యి కాలు ఫ్రాక్చర్ అయ్యింది. అప్పుడు నా అనువారు ఎవ్వరూ లేరు. దైవసేవకులు, సంఘంలోని సహోదరులు నా గురించి శ్రద్ధ తీసుకొని, పూర్తిగా నయం

అయ్యేంతవరకు ప్రేమ చూపించారు. దేవుని మహా కృప ద్వారా త్వరగా కోలుకోవటానికి సహాయం చేసారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో చాలీ చాలని జీతంతో సతమతమవుతున్న సమయంలో దేవుడు కనికరించినందున యం.జి.బి. కంపెనీలో మోటార్ సర్వీస్ ఇంజనీర్‌గా జాబ్ రావడం జరిగింది. 2005లో మా నాన్నగారు మతిస్థిమితం లేక సిటీలో తప్పిపోయారు. నా బంధువులు, రక్తసంబంధులు ఎంతోమంది సిటీలో తప్పిపోయిన మనిషి దొరకడం కష్టం అని దూషించి, అవమానపరిచి, వదిలేయండి అని చెప్పారు. అయితే దైవసేవకులు మాత్రం దొరుకుతాడు బాధపడవద్దు అని ధైర్యం చెప్పేవారు. వారం రోజులు తిరిగాను కానీ ఫలితం మాత్రం లేదు. పరిచర్యలో ప్రతినెలా రెండవ శనివారం జరిగే పూర్తి రాత్రి ఉపవాస ప్రార్థనలో సహోదరులు అందరూ కలసి ప్రార్థన చేసారు. తరువాత రోజు ఆదివారం ప్రార్థన అయిపోయేసరికి మా నాన్నగారు దొరికారు.

యం.జి.బి. మోటర్ అనే కంపెనీలో నేను మొదట 5000 రూ॥లు జీతముకు జాయిన్ అయ్యాను. సం॥లు గడుచుచుండగా క్రమేణా ఇప్పుడు 15,500 రూ॥లు జీతము నెలకు వచ్చేటట్లు దేవుడు సహాయం చేసారు. ఇదంతా నా మంచితనము కాదు, పెద్ద ప్రార్థనాపరుణ్ణి అని కాదు, కేవలం ఆయన కృప అంతే కాక దైవసేవకులు ఎప్పటినుండో మా పరిచర్యలో వారికి 5 అంకెల సంపాదన ఉండాలి అని చేయుచున్న ప్రార్థన నన్ను ఈ దినమున ఈ స్థితిలో ఉంచాయి.

గత కొన్ని నెలలుగా మా అమ్మగారు సెర్వికల్ క్యాన్సర్‌తో బాధపడుతుంటే ఆమెను చూపించు కోవడానికి కూడా దేవుడు కృప చూపుచున్నారు, డబ్బులు పోయినా, స్వస్థత కలుగుతుంది అన్న గ్యారెంటీ లేని పరిస్థితులలో కూడా దేవుడు మా అమ్మగారికి సంపూర్ణ స్వస్థతను అనుగ్రహించారు. అందును బట్టి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకుంటున్నాను. ఉండటానికి, తినటానికి కూడా సరిగా లేని పరిస్థితుల నుండి, దేవునిని ఎరిగి కూడా సరియైన భక్తి లేని అనుభవములన్నిటి నుండి ఆయన విడిపించి, సమృద్ధియైన జీవితమును, ఒక మంచి పరిచర్యలో నిలిపి దేవునిలో జీవించటానికి సహాయం చేసారు. నేను, నా కుటుంబము అంతా చివరి వరకు ఆయనకు లోబడి వాక్యానుసారముగా జీవించునట్లుగా దయచేసి ప్రార్థన చేయగలరు.






# ఇది తెలుసా?

## (ఇథియోపియా)

ఇథియోపియా ఆఫ్రికా ఖండములోని భూపర్యవేష్ఠిత దేశము. ప్రపంచములోని పురాతన దేశములో ఒకటి. ఆఫ్రికా ఖండములోని రెండవ అతి పెద్ద జనాభా గల దేశముగా మరియు అధిక సంఖ్య పేద ప్రజలు గలదిగా గుర్తించబడింది.

జనాభా: 78,000,000. రాజధాని: అద్దిస్ అబాబా. ప్రధాని: మేలస్ జినావి.

1. వ్యవసాయ ఉత్పత్తులు తక్కువగా ఉండుట వలన వాటి మీద వచ్చే ఆదాయం సరిపోక అనేకమంది గ్రామములో నివసించలేక నగరములకు వలస వెళ్ళి చాలీ చాలని ఆదాయముతో బ్రతుకును వెళ్ళబుచ్చుతున్నారు.
2. అధిక శాతం ప్రజల దినసరి ఆదాయము 50 రూపాయల కంటే తక్కువే
3. వలస వెళ్ళిన వారు అధిక సంఖ్యలో ఉండుట వలన ధాన్యం ఉత్పత్తులు తగ్గిపోయి దరిద్రతను కలుగజేస్తున్నాయి. అధిక జనాభా వలన చాలీ చాలని ఆహారము ఆకలితో అలమటించే వారిగా చేసి ఆరోగ్య పరిస్థితులను క్షీణింప చేస్తున్నాయి. 100 మందిలో 42 శాతం మంది 5 సం॥ లోపు పిల్లలు ఉండవల్సిన బరువు కంటే తక్కువగా ఉన్నారు.
4. 55 శాతం ప్రజలు మురికి వాడలలో నివశిస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణం, పరిశుభ్రమైన నీటి కొరత అనేక అంటువాధ్యులు వేగముగా వ్యాపించటానికి కారణమవుతున్నాయి.
5. అనేకమంది స్త్రీలు గర్భసంచికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారు. హెచ్.ఐ.వి.తో బాధపడే వారి సంఖ్య కూడా ఎక్కువే. సరియైన వైద్య సదుపాయము లేకపోవుట వలన ఇవి అధికముగానే కనబడుచున్నాయి.
6. సగం మంది ప్రజలు నిరక్ష్యరాసులుగా జీవించుచున్నారు. ప్రతి మనిషి సగటున సరాసరి జీవించు సంవత్సరములు 45 సం॥లు.

ఇన్ని సమస్యలు ఉన్న ఈ దేశం కొరకు భారంతో ప్రార్దిద్ధామా!



# డాక్టర్‌ని "మీరెందుకు" విజిట్ చేయకూడదు ?

ఒక తండ్రి 25 సం॥ల వయసు కలిగిన తన కుమారుడితో ట్రైన్‌లో ప్రయాణం చేయుచున్నాడు. ట్రైన్ స్టేషన్ నుండి బయలుదేరి వెళ్ళుచుండగా ప్రయాణీకులు అందరూ తమ తమ సీట్లలో కూర్చున్నారు. ట్రైన్ కదులుతూ ఉన్నప్పుడు కిటికీ ప్రక్కన కూర్చుని డాడీ ! డాడీ ! చూడు అన్నీ వెనుకకు వెళ్ళిపోవుచున్నవి అంటూ సంతోషముగా కేకలు వేస్తున్నాడు. తండ్రి నవ్వుతూ కుమారుడి యొక్క ఆనందములో పాలు పంచుకుంటున్నాడు. వారికి ఎదురుగా ఇద్దరు భార్యాభర్తలు కూర్చుని తండ్రీ, కొడుకుల సంభాషణ అంతటిని వింటూ అతడు చిన్నపిల్ల వాడి వలె ప్రవర్తించుటను వింతగా చూచుచుండిరి. అకస్మాత్తుగా ఆ యువకుడు చెట్లు, చెరువులు, జంతువులు మరియు మేఘములను చూపిస్తూ, విచిత్రముగా ప్రవర్తించసాగాడు. ఇంతలో వర్షం పడటం ప్రారంభమైంది. ఆ వర్షపు నీటితో చేతుల్ని తడుపుకుంటూ కేరింతలు కొట్టసాగాడు. అప్పుడు ఎదురుగా ఉన్న భార్యాభర్తలు అసహనంగా కదులుతూ, అసహ్యంగా చూస్తూ ఆవేశంగా మీ అబ్బాయితో కలిసి డాక్టర్‌ని ఎందుకు విజిట్ చేయకూడదు ? ట్రీట్‌మెంట్ ఇప్పించవచ్చు కదా ! అని సలహా ఇచ్చారు. అప్పుడు తండ్రి మేము హాస్పిటల్ నుండే వస్తున్నాము, నా కుమారుడు గ్రుడ్డివాడు, ఆపరేషన్ చేయించుట ద్వారా ఈ దినమే లోకమును చూచుచున్నాడు అని సమాధానమిచ్చాడు. గమనించారా ! వారి కనుల ముందు కనబడుతున్న దానిలో సత్యమును గ్రహించకుండా, అపార్థము చేసుకొని, భార్యాభర్తలైన వారిద్దరూ ఆ యువకుడికి మానసిక వైకల్యం ఉందనుకున్నారు. తర్వాత ఆ జంట ఎంత బాధపడి ఉంటారో కదా !

అనేక సందర్భములలో మనము కూడా కన్నులతో చూచుచున్న వాటిని బట్టి ఒక నిర్ణయమునకు వస్తూంటాము. కానీ అనేకసార్లు మన ఊహలకు కూడా అందనన్ని అంతరార్థములు ఉంటాయి. దీనిని బట్టి ఎన్నిసార్లు మనం మనుష్యులను అపార్థం చేసుకున్నామో చెప్పలేము. కనుక చూచిన వాటిని బట్టి ఒక నిర్ణయమునకు రావడం అజ్ఞానం అవుతుంది. దీని ద్వారా పరసంబంధమైన జ్ఞానము దేవుడు మనకు కలుగజేయును గాక !




# ఆత్మ ఫలము - 5వ భాగము

- ఎడిటర్

**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, సాత్వికము, ఆశానిగ్రహము.**

**ఆత్మ ఫలములో రెండవది సంతోషము**

సంతోషము అనెడి ఫలము ఎంతో అద్భుతమైనది. మీకు ఎన్ని సమస్యలు ఉన్ననూ సంతోషము ఉంటే వాటన్నిటిని అధిగమించ గలుగుతాము. ప్రభువైన యేసుక్రీస్తు మనకి అనుగ్రహించిన సమాధానమును బట్టి కూడా సంతోషముగా ఉండగలుగుతాము. జీవితములో మనకి దుఃఖము కలుగజేసి మనలను సంతోషమునకు దూరంగా ఉంచే పరిస్థితులలో కూడా క్రీస్తును అంగీకరించిన మనము సంతోషమును కలిగి ఉండవచ్చు. సంతోషం అనగా మన చుట్టూ జరుగుచున్న సంఘటనలను బట్టి నవ్వుతూ ఉండటం మాత్రమే కాదు, మనలో ఉండే సంతోషము పరిస్థితులపై ఆధారపడి లేదు. ఉదాహరణకి నేను కారులో ప్రయాణం చేస్తుండగా, కారు ఇంజనులోపం వలన ఆగిపోయినంత మాత్రమున నా హృదయంలో ఉన్న సంతోషం తొలగిపోదు. అంతరంగములో నుండి వెలువడే సంతోషము పరిస్థితులను బట్టి ఆధారపడి ఉండదని దీనిని బట్టి గ్రహించ గలుగుతాము. నిజ జీవితములో కలిగే ఆటంకములు అనగా చాలినంత డబ్బు లేకపోవడం, మనము అనుకున్నవన్నీ జరగకపోవడం, మనం కోరుకున్న విధంగా మనుష్యులు ఉండకపోవడం ఇలాంటివన్నీ కూడా జీవితంలో ఒక భాగం అని గ్రహించగలిగితే మనం సంతోషమును పోగొట్టుకోలేము. ప్రతి దినము దేవుడు నా గురించి శ్రద్ధ కలిగి ఉన్నారనే ఆలోచన సంతోషమును కలిగిస్తుంది. విశ్వాసము ద్వారా సమస్తమైన ఆనందమును మరియు సమాధానమును కలిగి ఉండగలమని రోమా 15:13 తెలియజేస్తుంది. విశ్వాసము లేకుండా ఆనందమును పొందలేము. మనం ఆనందమును కోల్పోయినప్పుడు మనల్ని మనం పరీక్షించుకోవలసి ఉంది. మన శత్రువైన అపవాదికి సంతోషం అంటే ఇష్టం లేదు కనుక కృంగిపోవటం, నిరాశ, నిరుత్సాహం, చింత మనకి కలగాలని ఆశిస్తాడు. దేవుని వాక్యము యెహోవా యందు ఆనందించుట వలన మీరు బలమొందుదురు అని చెప్పుచున్నది. మనము ఎల్లప్పుడూ ఏదో ఒక దాని గురించి దీర్ఘంగా ఆలోచిస్తూ ఉన్నట్లైతే జీవితమును సంతోషముగా గడపడాన్ని సులువుగా మర్చిపోతాము.ఎంత ఎక్కువ దినములు మన సంతోషమును దొంగిలిస్తే సాతానుడు అంత జయము పొందినట్లుగా భావిస్తాడు. అందుకే మన కన్నుల ఎదుట అనేకులను ఉంచి, సంతోషము మీ కొరకు కాదు అది కేవలం ఇతరుల కొరకు మాత్రమే అని మనకి ఉన్న చిన్న సమస్యల్ని పెద్ద సమస్యలుగా భూతద్దములో చూపించి అబద్ధములు చెప్పి మన సంతోషమును దొంగిలిస్తాడు, వాటిని నమ్మకూడదు. ఎందుకనగా సమస్యల కంటే గొప్ప దేవున్ని మనము వెంబడిస్తున్నాము. యోహాను 16:33లో లోకములో మీకు శ్రమ కలుగును, అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి ఉన్నాననెను. ఇట్టి వాక్యములను బట్టి మనము ఎల్లప్పుడూ ఆనందముగా జీవించెదము. అదే విధంగా కీర్తన 30:5లో సాయంకాలమున ఏడ్పు వచ్చి, రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును అని చెప్పబడినట్లుగా ఎన్ని శ్రమలు కలిగిననూ కొంచెము కాలమే, తరువాత సంతోషము కలుగుతుంది.



# నెబో పర్వతం

నెబో పర్వత శిఖరము పై నుండి దేవుడు ఇశ్రాయేలీయులకు స్వాస్థ్యముగా ఇచ్చుచున్న కనాను దేశమును మోషేకు చూపించినట్లుగా బైబిల్ గ్రంథములో చెప్పబడింది.

యొర్దాను నది మృత సముద్రములో పారు స్థలమునకు తూర్పుగా ఆమడ దూరములో మోయాబు మైదానములో గల పిస్గా కొండ యొక్క శిఖరాగ్రము నెబో పర్వతము. ఇది సముద్ర మట్టమునకు 2,643 అడుగుల ఎత్తులో ఉన్నది. ఈ పర్వతము అక్టోబరు నుండి జూలై నెల వరకు మంచుతో కప్పబడి ఉంటుంది.

ఇశ్రాయేలు సర్వసమాజమునకు సీను అరణ్యములో నీళ్ళు లేకపోయినందున వారు మోషేతో వాదించుచు సణుగుచుండిరి. అప్పుడు మోషే అహరోనులు యెహోవా ఎదుట సాగిలపడగా యెహోవా మహిమ కనబడెను.

యెహోవా మోషేకు ఈలాగున సెలవిచ్చెను -

నీవు నీ కర్రను తీసికొని, అహరోనును, ఈ సమాజమును పోగుచేసి వారి కన్నుల యెదుట ఆ బండతో మాట్లాడుము అది నీళ్ళిచ్చును. నీవు వారి కొరకు నీళ్లను బండలో నుండి రప్పించి సమాజమునకును వారి పశువులకును త్రాగుటకిమ్ము. (సంఖ్యా 20:7,8) యెహోవా అతనికి ఆజ్ఞాపించినట్లు మోషే ఆయన సన్నిధి నుండి ఆ కర్రను తీసుకొనిపోయి బండను 2 మార్లు కర్రతో కొట్టగా నీళ్లు సమృద్ధిగా ప్రవహించెను. సమాజమును, పశువులును త్రాగెను. అప్పుడు యెహోవా మోషే, అహరోనులతో మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానించునట్లు నన్ను నమ్మక పోతిరి గనుక ఈ సమాజమును నేను వారికిచ్చిన దేశములోనికి మీరు తోడుకొనిపోరని చెప్పెను.

మోషే మోయాబు మైదానము నుండి యెరికో ఎదుటనున్న పిస్గా కొండ వరకు పోయి నెబో శిఖరమునకెక్కెను. అప్పుడు యెహోవా దాను వరకు గిలాదు దేశమంతయు, నఫ్తాలి దేశమంతయు, ఎఫ్రాయిము మనష్షేల దేశమును పశ్చిమ సముద్రము వరకు యూదా దేశమంతయు దక్షిణ దేశమును, సోయరు వరకు ఈత చెట్లుగల యెరికో లోయ చుట్టు మైదానమును అతనికి చూపించెను. మరియు యెహోవా అతనితో ఇట్లనెను. నీ సంతానమునకిచ్చెదనని అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు నేను ప్రమాణము చేసిన దేశము ఇదే కన్నులారా నిన్ను దాని చూడనిచ్చితిని గాని నీవు నది దాటి అక్కడికి వెళ్ళకూడదు. ద్వితియో 34:1-4

నమ్మకస్తుడిగా, సాత్వికుడిగా దేవుని యొద్ద నుండి సాక్ష్యం పొంది, 40 సం॥లు అవిధేయులై, సణుగులు,సంశయములతో నిండిన ఇశ్రాయేలు ప్రజలకు ఒక మంచి నాయకుడిగా ఉండి నడిపిస్తున్న మోషే జీవితములో విసుగుదలతో చేసిన పని వలన నెబో పర్వతము పై నుండి వాగ్దాన దేశమును చూడగలిగాడు గానీ ప్రవేశించలేక పోయాడు.

వాగ్దాన దేశమును మోషే చూచిన వెంటనే యెహోవా మాట చొప్పున మోయాబు దేశములో మృతి నొందెను. మోషే చనిపోయినప్పుడు 120 సం॥ల వయసు గలవాడు, అతనికి దృష్టి మాంద్యము లేదు, సత్తువ తగ్గలేదు. మోయాబు దేశములో ఉన్న లోయలో అతడు పాతిపెట్టబడెను. అతని సమాధి ఎక్కడ ఉన్నదో నేటి వరకు ఎవరికి తెలియదు. నెబో పర్వతం ఉన్న ప్రాంతం మోషే చనిపోయిన పరిశుద్ధ స్థలంగా గుర్తించబడి ఒలీవ చెట్లు నాటించబడి, శాంతికి చిహ్నంగా గుర్తించబడింది. ఈ దినమున యొర్దానులో క్రైస్తవులు సందర్శించే స్థలములలో నెబో పర్వతం ఒకటిగా పరిగణించబడుతుంది.




# బైబిల్ క్విజ్ -7

**పాతనిబంధనా గ్రంధంలో ఐదు పుస్తకములలో నుండిఇవ్వబడినవి**

1. కనాను నుండి ఐగుప్తుకు బయల్దేరి వచ్చిన ఇశ్రాయేలీయులు ఎంతమంది ?
2. అహరోను ఏ కొండ మీద మృతి చెందెను ?
3. దీపవృక్షమును దేనితో చేయవలెనని ఆజ్ఞ ఇచ్చెను ?
4. ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తులో ఏ ప్రాంతంలో నివసించేవారు ?
5. దేవుడు ఐగుప్తుపై పంపిన విపత్తులు ఎన్ని ?
6. మేక వెంట్రుకలను వడికిన స్త్రీలు ఎవరు ?
7. షిఫ్రా, పూయా అనువారు ఎవరు ?
8. రక్తము తినకూడదని ఆజ్ఞాపించిన రిఫరెన్సు ?
9. తల్లిదండ్రుల మాట వినక మొండివాడై తిరగబడు కుమారుని రిఫరెన్సు ?
10. అమోరీయుల రాజైన సీహోనుకు చేసినట్లు ఇతనికిని చేయుదువు అని ఎవరిని గూర్చి మోషేకు దేవుడు చెప్పెను?

ఈ ప్రశ్నలకి సరైన సమాధానములు డిసెంబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

---

**బైబిల్ క్విజ్ - 6 జవాబులు :**

1. మోషే (సంఖ్యా 13:16) 2.రిస్పా (2 సమూ 21:10) 3.దేవుడిచ్చు సర్వాంగ కవచము (ఎఫెసీ 6:11) 4.మిర్యాము (సంఖ్యా 12:10) 5. అష్డోదువారి మీద (1 సమూయేలు 5:6) 6. గాతు రాజు (1 సమూయేలు 21:10) 7.కోరహు కుటుంబము (సంఖ్యా 16:32) 8. మెతూషెల 969 సం॥ (ఆది.కా.5:27) 9. ఉజ్జా (2 సమూయేలు 6:7) 10. తండ్రి ఎల్కానా, తల్లి హన్నా (1 సమూయేలు 1:8)

**బైబిల్‌క్విజ్-6 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:**

1. కె.సాల్మన్ రాజ్ (భాగ్యలత కాలని) 2. పి.రాజ్‌కుమార్ (భాగ్యలత)

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## నవంబర్ - డిసెంబర్

**భాగ్యలత:** సుధారాణి, టి.హెప్సిబా, మణి, కె.మేఘన, రాధిక, బేబి.ప్రజ్ఞ, మాస్టర్.కె.ప్రవీణ్, బేబి.ప్రవల్లిక, మాస్టర్.అభిషేక్, ఎన్.కనికరమ్మ, బేబి.రూప, మాస్టర్.థామస్, మాస్టర్.రమేష్, తర్షీనా, రాజ్‌కుమార్ సతీష్ బాబు, బేబి.అమూల్య, చంద్రశేఖర్, పుష్పలత, రాధిక, బి.లూధియా, మాస్టర్.సతీష్, మాస్టర్.నవీన్, బేబి.కరుణ, బి.కృష్ణవేణి, ఎ.ప్రవీణ్, జి.ఆశీర్వాదమ్మ, ఎన్.దివ్యజ్యోతి, మాస్టర్.ఆనిష్‌ప్రసాద్, ఫిన్నీనోయల్

**చింతల్:** మాస్టర్.రాజ్‌కిరణ్, మాస్టర్.శశాంక్, మార్గరెట్, వి.దానియేలు, పి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సుహాసిని, కుమారి, పావని, దానియేలు, కుమారి.దివ్యజ్యోతి, సాల్మన్, ఎమ్.ఎస్తేరురాణి, మంజుల, లక్ష్మారెడ్డి.

**అనాజ్‌పూర్:** మాస్టర్.థామస్ పీటర్, బేబి.జి.నీలిమ, మాస్టర్.కె.కిరణ్, బేబి.స్వాతి, కె.కృపావరం, హేమలత, రూతు, మాస్టర్.శ్రీకాంత్.

**ఇ.సి.ఐ.ఎల్:** మాస్టర్.ప్రేమ్‌కుమార్.

# జాన్ బన్యన్



జాన్‌బన్యన్ క్రీ.శ.1628 నవంబర్ నెలలో ఇంగ్లాండ్ లోని బెడ్‌ఫోర్డ్ పట్టణమునకు సమీపమున గల ఎల్‌స్టౌ అను గ్రామములో జన్మించెను. ఇతని తండ్రి లోహపాత్రలను బాగుచేయు "టింకర్" వృత్తి చేసి బన్యన్‌కి కూడా దానినే అప్పగించాడు. చిన్నతనము నుండి బన్యన్ ఆదివారం జరిగే ఆటపాటలలో రింగు లీడర్‌గా ఉంటూ, మొండి ధైర్యంతో దేవునికి దూరంగా జీవిస్తూ ఉండేవాడు. ఈ విధముగా ఆటలాడుచున్న సమయములోనే ఒక శబ్దము అతనితో "నీవు నీ పాపములను విడిచి పరలోకమునకు వెళ్ళెదవా ? లేక పాపములతోనే నరకమునకు వెళ్ళెదవా ?" అనెను. ఆ శబ్దము విని బన్యన్ మిక్కిలి భయపడి "నేను మహా పాపిని, క్రీస్తు నన్ను క్షమించడు, పాపములను విడిచిపెట్టిననూ దౌర్భాగ్యుడనే, అనుసరించిననూ దౌర్భాగ్యుడనే పాపములు ఎక్కువైతేనేమి, తక్కువైతేనేమి అనుకొని తన బాధను నిరాశచేత తప్పించుకొనగోరెను.

క్రీ.శ 1644 నుండి 1647 వరకు బన్యన్ పార్లమెంటు సైన్యములో పని చేసెను. సైన్యములో ఉన్నప్పుడు అతని ప్రక్కన నిలువబడి కావలి కాయుచున్న తోటి సైనికునికి తలలో తూటా దూసుకొని పోయెను. అది తన పాపములను, ఆత్మస్థితిని గురించి దీర్ఘముగా ఆలోచన చేయుటకు బన్యన్‌ను ప్రేరేపించి ఆత్మీయంగా జీవించవలెనని కోరుకొనెను.

బన్యన్ యుద్ధం నుండి తిరిగి వచ్చిన తరువాత దైవభక్తి గల ఒక స్త్రీని వివాహము చేసుకొనెను. వివాహం అయినప్పుడు ఆమె తండ్రి తన కుమార్తెకు ఏమీ ఇవ్వలేనప్పటికి, రెండు క్రైస్తవ పుస్తకములను బహుమానంగా ఇచ్చెను. అవి బన్యన్‌కు క్రైస్తవ్యము యెడల మరింత ఆసక్తి పెరుగుటకు ప్రేరణ నివ్వగా 1653వ సం॥లో బాప్టిస్టు చర్చినందు బాప్తీస్మము తీసుకొని, 1657వ సం॥లో తన జీవితమును దేవుని సేవకై అప్పగించుకొనెను. అతి తక్కువ కాలంలోనే గొప్ప ప్రసంగీకుడుగా పేరు పొంది, వాక్యపరిచర్య ద్వారా సువార్తను ప్రకటిస్తూ గొప్ప జనసమూహములను దేవుని వైపుకు త్రిప్పెను. ఈ విధంగా వాడబడుచున్న సమయంలో అతనిని పోలీసులు అరెస్ట్ చేసిరి. దేవుని గూర్చి ప్రకటించుట ఆపివేస్తే వదిలిపెడతాము అనే అవకాశమును ఇచ్చిననూ, అరెస్ట్ కావడం కూడా దేవుని చిత్తమని భావించి కోర్టు ముందు నిలబడెను. చెరసాలలో ఉన్న ఆ సమయములోనే అతడు పరలోక పట్టణమునకు క్రైస్తవుని ప్రయాణము అందలి ఇతివృత్తమును వివరించుచు "యాత్రికుని ప్రయాణము" అను పుస్తకము రచించెను. ఈ పుస్తకం నేటివరకు క్రైస్తవ నవలా గ్రంధములలో ప్రాముఖ్యమైనదిగా ప్రాచుర్యం పొందెను. జైల్‌లో ఉండి ఇంచుమించుగా 12 పుస్తకములను రచించెను. ప్రజలకు సేవచేయుటలో మిక్కిలి సంతోషమును పొందిన జాన్‌బన్యన్ బెడ్‌ఫోర్డ్‌లోని తన ప్రియ సంఘముతో జీవితము యొక్క చివరి సంవత్సరములు గడిపెను. జాన్‌బన్యన్ ఒక తండ్రి కొడుకుల మధ్య వచ్చిన వివాదమును తీర్చుటకు వెళ్ళి వచ్చుచూ, భీకర తుఫానులో చిక్కిననూ క్షేమముగా ఇంటికి చేరెను, కానీ జ్వరముతో బాధపడి 1688వ సం॥లో ఆగస్టు 31న తన విశ్వాస పోరాటము ముగించి దేవుని సన్నిధికి చేరెను.

# క్రిస్మస్ కానుక

ఈ భూగోళం మీద ఉన్న సమస్త మానవాళి చరిత్రను రెండు భాగాలు (క్రీస్తుపూర్వం, క్రీస్తుశకం)గా చేసిన ఆరోజు, మన క్యాలెండర్‌లలో, కంప్యూటర్లలో కనిపించే తేదీలకు ఆధారమైన ఆరోజు క్రీస్తు యేసు పుట్టినరోజు. అసమానుడైన క్రీస్తు పుట్టిన ఆరోజును ప్రపంచమంతా పండుగగా ఆచరిస్తుంది. అయితే యేసుక్రీస్తు పుట్టుక ద్వారా ప్రతి మనిషికి దేవుడు సిద్ధపరచిన అమూల్యమైన బహుమానమును అనేక మంది గుర్తించలేకపోతున్నారు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావడానికి గల కారణం ఏమిటో ఈ చిన్న ఉపమానం ద్వారా సులభంగా అర్థమవుతుంది. ఒకరోజు ఒక తండ్రి 7 సంవత్సరాల కుమారుడితో కాలువ గట్టున కూర్చుని ఉన్నాడు. ఆ కుమారుడు కాలువ ఒడ్డు అంచున ఉన్న చీమలగుంపును గమనిస్తూ ఆనందిస్తున్నాడు. నీటి ప్రవాహం పెరుగుతూ ఉండటంతో ఆ చీమలు నీటిలో పడి కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఆ బాలుడు వాటి స్థితి చూసి చాలా బాధపడుతూ ఒడ్డుకు వచ్చేయండి లేకపోతే కొట్టుకుపోతారు అని అరుస్తున్నాడు. చీమలకు వినబడాలని ఎంత అరిచినా ఫలితం శూన్యం. అప్పుడు తండ్రి కుమారునితో ఇలా అన్నాడు. "నువ్వు ఎంత అరిచి బాధపడినా ప్రయోజనం లేదు. చీమలు నీ భాష అర్థం చేసుకోలేవు. నీవు చీమగా మారితే వింటాయి. అప్పుడు కుమారుడు నేను చీమగా మారి వాటిని రక్షిస్తాను అన్నాడు. వాటిని రక్షించుకోవాలనే తపనతో ఆ బాలుడు అమాయకంగా మాట్లాడినా,సరిగ్గాఅటువంటి నిష్కళ్మషమైన, నిస్వార్థమైన ప్రేమ దేవుని కుమారుడైన యేసును రక్తమాంసములు కలిగిన మనుష్యునిగా మన మధ్య జన్మింపచేసింది. దేవుడు మన భయాలను పోగొట్టి మన ఆత్మను విడిపించాలని తన సొంత కుమారుడిని మన కోసం మన మధ్యకు పంపించాడు. కన్య మరియ పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టింది. తండ్రి అయిన దేవుడు నీ యొక్క జన్మ, కర్మ పాపములను సిలువలో తన కుమారుని మీద మోపి మనలకు విమోచనను సిద్ధపరిచాడు.



యేసు జన్మ పునీతమైనది, ఆయన గుణము సాటిలేనిది, ఆయన జీవితము విశిష్టమైనది. యేసు జన్మించుటకు 700 సం.ల పూర్వమే ఆయన జన్మించే విధానం, జన్మస్థలం, సిలువ మరణము మరియు పునరుత్థానము గురించి దేవుడు స్పష్టమైన వివరాలను తన భక్తులద్వారా గ్రంథస్థం చేయించాడు. యేసును మించిన కారణజన్ములు ప్రపంచ చరిత్రలో మరెవ్వరులేరు, ఇక ఉండబోరు. నీ జీవితానికి జవాబు అయి ఉన్న యేసును, అమూల్యమైన క్రిస్మస్ బహుమానముగా దేవుడు నీ కొరకు పంపించాడు. దేవుని యొక్క బహుమానమును నీవు స్వీకరించి దేవుని దీవెనలను పొందు కొనగలవు.


## ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com